# స్ట్రైక్

బి. టి. రామానుజం

రోజూ దుమ్ము రేపుకొంటూ, గుడిసెను దాటిపోయే లారీలు ఇవాళింకా రాలేదు. "ఏటయినాదో-" అనుకొంటూ నీలి బయట పడేసున్న నులకమంచం మీద కూర్చొంది.

దూరంగా కొండ కనబడుతోంది చిన్నచిన్న అగ్గిపెట్టెల్లా కనబడుతున్నాయి లారీలు. మధ్యాన్నం పన్నెండు గంటలయింది. ఎంత విపరీతంగా ఉంది. కొంచెం లోటాతో నీళ్ళు తాగి- 'అయ్యేటయినాడో సూడాల- అంత దూరవెళ్తే ఏటంటాడో-' అని ఓక్షణం ఆలోచించింది. 'లేపోతే ఆళ్ళంతా కలిసి లారీలెక్కి ఎళ్లిపోతారేటో?'

ఆరేళ్ళ చిన్న పిల్లకు అర్థం అయే విషయాలు తక్కువే అయినా మూడు నాలుగు రోజుల్నుంచి ఏదో గోలగోలగా అన్పిస్తోంది సొమ్ములు చాల వంటున్నాడు అయ్య. మిగతా వాళ్ల అగ్గయిపోతున్నారు.

నడుస్తుంటే కాళ్లు కాలిపోతున్నాయి, నిప్పుకు కాళ్లు అంటుకు పోయినట్లుగా. కళ్లుతిరిగి పడిపోయేది. పరుగు పరుగున వెళ్లింది.

కొండ పక్కన ఒక పక్కంతా తవ్వేసి వుంది. పక్కనే పెద్దషెడ్డు లాంటిది ఒకటి వేశారు. మిషను మోత హోరుమని. కొండ తవ్విన రాయి షెడ్డులోకి వెళ్తుంది. అక్కడ మిషను వాటిని కావల్సిన సైజులోకి మారుస్తుంది. తయారయిన రాళ్ళముక్కలు లారీల్లోకి ఎత్తుతారు. అవి లారీల్లో ఐదుమైళ్ల వతలున్న చోటకు వెళ్తాయి. అక్కడ వాటినేం చేస్తారో నీలికయితే తెలీదు. అక్కడేదో పెద్దది కడుతున్నారట- అని మాత్రం ఆపిల్లకెరుక.

తట్టలన్నీ కింద పడేసున్నాయి.

జనాలంతా ఓవారన కూర్చుని వున్నారు. ఎండకి ఒళ్ళంతా చెమటలు పట్టేసి నల్లగా మెరుస్తూ కనబడుతున్నాయి. వాళ్ల తెచ్చుకొన్న చద్దిమూటలు ఇంకా విప్పకుండా అలానే వున్నాయి. నీలి గభాల్న పోలయ్య దగ్గిరకు పరిగెత్తింది.

"ఏటయింది-" అని చిరాగ్గా అరిచేడు పోలయ్య.

"ఇయాల లారీల కదల్లేదని...." భయం భయంగా గొణిగింది నీలి.

"ఆ ఎల్తాయి, ఎల్తాయి. అద్దరూపాయి కాడ బేరం కుదిరి సావటం నేదు గానీ...." పోలయ్య కూడా గొణుక్కున్నాడు. అతనిప్పటి దాకా లారీలో కూర్చుని కూర్చుని విసుగెత్తి కిందకు దిగి చార్మినార్ సిగరెట్టు వెలిగించాడు. ఆకలికి కాబోలు నాల్గుదమ్ములు లాగేసరికి తల దిమ్మెక్కింది కడుపులో తిప్పింది.

852

ఎప్పుడో ఒక్కసారి కాబోలు పోలయ్య నీలిని లారీలో కూర్చోపెట్టి తీసికెళ్లాడు. దారి పొడుగునా రాళ్ళగుట్టలు, దారి మహా అయోమయం-ఇరుకు, అక్కడ లారీ తోలటం చాల కష్టం. వెళ్తూవెళ్తూ గొయ్యిలో పడి సగం తిరగబడింది. ఆ తర్వాత ఎప్పుడూ ఆ పిల్లను లారీలో తీసికెళ్ళ లేదతను.

కంట్రాక్టరు కనకారావు ఇందాకణ్నుంచి అరిచి అరిచి లాభం లేదనుకున్నాడు. "అయితే ఏం చేస్తారో చావండి" అన్నాడు.

"సమ్మె –" అన్నారు.

అలా అన్న తర్వాత అతనికి దిగులు పట్టుకొంది. ఐదుమైళ్ళవతలకు లారీల్లో రాళ్ళు చేర్చడం ఓ పెద్ద తలనొప్పి వ్యవహారం. దీనికి తోడు కట్టబోయే ప్రాజెక్టు పదేళ్ళలో పూర్తయిపోవాలి. లేకపోతే ఎంత నష్టమో లెక్కకట్టుకొని మరీ చూశాడు.

పొద్దున్నుంచీ లారీలు కదల్లేదు. రాళ్లు కొట్టలేదు. మిషన్లు ఆడలేదు. పనికి పనీ పాడయింది. జనాలు మొండిగా కూర్చుని రేటు పెంచమంటున్నారు. కనకారావుకు ఇవాళ అనుకోకుండా కొత్తగా నెత్తిమీద కొచ్చింది కాదిది. అయితే ఏం చెయ్యాలో అతనికి తెలీకపోవటం వల్ల చిరాకుగా వుంది.

అక్కడంతా కలిసి ఓ నూటయాభై మంది ఉన్నారు. కొంతకాలం పోయి పని ఎక్కువయితే ఇంకో రెండొందల మంది కావల్సి వుంటారు. వీళ్ళందరికీ రేటు పెంచి పారేస్తే ముందు ముందు ఏమవుతుందో?

ఇదివాళుండి రేపు అయిపోయే పనయినా బావుండును, వెధవది నాల్రూపాయలు పోయాయి అనుకోడానికి. పెట్టుకొన్న కంట్రాక్టే ఇలాంటిది. ఐదుమైళ్ళ దూరం రోడ్డు బావుండి చచ్చినా అదోదారి. కొట్టిన రాళ్ళను కొట్టాలి. తయారయినవి గంపల్లో ఎత్తించి లారీలోపోసి మళ్ళీ అక్కడ దింపాలి. మెయిన్ రోడ్డు దాకా వెళ్ళిపోతే ఆ తర్వాత ఎలాగయినా లారీలు వెళ్ళిపోతాయి అయితే చిక్కంతా రాయి ఇక్కణ్ణుంచి అక్కడి కెళ్ళేదాకానే. ఈ ప్రాజెక్టు పదేళ్ళనుకొంటే ఇంకా ఇంకా సప్లైచెయ్యాల్సిన టెండర్లు పెరిగిపోతున్నాయి.

కారేజీ తినేసి కూర్చున్నాడతను. పాకలో చల్లగానే వుందిగానీ బయటనుంచి వేడిగాలి వీస్తోంది.

పెద్దగా హారన్ వాయించుకొంటూ వచ్చి ఆగింది జీపు.

చిట్టిబ్బాయి కూలింగ్ గ్లాసులు తుడుచుకొంటూ దిగాడు.

853

"ఏంటయింది టెండరు?" అన్నాడు కనకారావు.

"టెండరు రాకే మవుతుంది–"

"అవును మన బొక్క బద్దలయిపోతోంది. చూసిచూసి దీల్లే కెవడు దిగుతాడునో"

చిట్టబ్బాయి చుట్టూ చూశాడు.

"ఏం మనుషులు బొమ్మల్లా కూర్చున్నారు?" అన్నాడు చివరికి.

"నాబొంద స్ట్రయికంట. వాళ్ళ రేట్లు పెంచక పోతే రారుట– ఇదో పెద్ద నరకం అయికూర్చుంది నాకు–"

"సర్లే నువ్వింటికిపో ఇవ్వాళ్టికి–"

"నువ్వేం చేస్తావు?" అన్నాడు కనకారావు.

తమ్ముడు ఇంజనీరు. ఇద్దరూ కలిసి కంట్రాక్టులు చేస్తున్నారు.

"అదేనేనూ చూస్తున్నాను. ఈ గొడవేదో పర్మనెంటుగా తీరిపోయే మార్గం కోసం చూస్తున్నాను. దాంట్లో లాభమే గానీ నష్టం వుండ కూడదుగా, అందుకే జంకుతున్నాను"

కనకారావు జీపుఎక్కి వెళ్లిపోయాడు.

చిట్టబ్బాయి తాపీగా సిగరెట్ తాగుతూ రెస్ట్తీసుకొంటూ కూర్చున్నాడు. కాసేపటికి ఎవరో వచ్చారు.

"అయితే శెలవు తీసుకోమంటారా అయ్యగారూ–" అంటూ–

"మాకూ కొంచెం ఆలోచించుకోవాలా? వెళ్ళండి ఇవాళిలుకి పనీలేదు పాడూలేదు"

పోలయ్య నీలిని భుజాన ఎత్తుకుబయల్దేరాడు.

ఆవేళ జనాలంతా ఇళ్ళకెళ్లి పోతున్నారని మాత్రమే అర్థమయింది నీలికి. ఆ తర్వాత ఇంకో రెండు రోజులు రొడ్డుమీద లారీలు వెళ్ళలేదు. చిట్టబ్బాయి జీపు మాత్రం రోజుకు మూడు నాలుగు సార్లు వెళ్తూ కన్పించేది.

పొద్దున్నే తెలతెలవారుతుంటే బళ్ళ చప్పుడు వినిపించింది. లేచి చూస్తే పక్కలు లేని లారీలు భారంగా కదులుతున్నాయి, వాటిమీద ఇనప సామాన్లు నిండా వున్నట్లు కన్పిస్తున్నాయి.

పోలయ్య కూడా మళ్లీ వెళ్లాడు. "కంట్రాక్టరు బాబు కొత్త పనేదో మొదలెట్టాడు" అన్నాడు ఎవర్తోనో.

854

నెల రోజులు జోరుగా మనుషులు లారీలు ఇనపసామాన్లు. కరెంటు స్తంబాలు పాతినట్లు పెద్దపెద్ద స్థంబాల్లాంటివి వేస్తున్నారు. బారుగా రోడ్డున్నంత బారూను. మిషనున్న దగ్గిర పెద్దటాంకు కట్టినట్లు ఏదో కడుతున్నారు.

ఇంకోనెల అయింది.

రాత్రియే సరికి వచ్చాడు పోలయ్య. వస్తూనే బయటున్న నులక మంచాన్ని గట్టిగా తోసేస్తూ;

"లంజకొడుకులు" అన్నాడు.

ఏమయిందో నీలికి తెలీదు. మర్నాటి నుంచీ లారీలు తిరిగినట్లు కన్పించలేదు. ఆ రోజు పొద్దున్నుంచీ తండ్రి రాలేదు. మంచం మీద పడుకొని ఆకాశంలోకి చూస్తోంది. కొంచెం దూరం నుంచి పైన అంతా పెద్ద గొట్టంలా కట్టారు. అలా అది తీగలా కొండల దారి నుంచి బయటకి ఎక్కడికో వెళ్తోంది. అదెందుకు కట్టారో నీలికయితే తెలీదు.

సాయంత్రం అవుతుంటే పైనుంచి ధూళి నెమ్మదిగా కిందకు పడింది. కళ్ళు నులుముకు చూస్తే గొట్టంలో నీలికి కన్పిస్తున్న బెల్టు చప్పుడు చేస్తోంది. కంకర రాళ్ళు వేగంగా ప్రవాహంలా వెళ్ళిపోతున్నాయి. మిషను దగ్గిర లోడింగ్ అయిన రాళ్ళు ఐదుమైళ్ళ అవతలకి కన్వేయర్ బెల్ట్ మీద ప్రయాణం చేసి వెళ్తున్నాయి. చిట్టిబ్బాయి పీడ వొదిలించుకోడానికి ఖర్చయినా ఓ పద్ధతి తయారు చేసాడు- ఏళ్ళ తరబడి మనుషుల ఖర్చు లేకుండా.

పోలయ్య రెండు మూడు రోజులకోసారి వచ్చేవాడు.

నీలికి చెవులు పగలూ - రాత్రీ చప్పుడుతో నిండిపోతున్నాయి. అంతకాలం వున్న జనాలందరి బదులూ పైన కట్టిన యంత్రం లాంటిది సమస్య తీర్చేసిందన్న విషయం లీలగా అర్థమయిందామెకు. మూడు నాల్గురోజులకు గానీ ఇంటికి రాలేక పోతున్న తండ్రి స్థితికి ఈ భూతమే కారణం అన్న విషయం తోస్తే ఆమెకి పిచ్చి పట్టినట్లయింది.

ఎప్పుడయినా హోరున వానపడితే ఉరుములు చప్పుడు వినిపించినప్పుడు, పిడుగులు పడినట్లు చెవులు బద్దలయితే ఆ పిడుగులు ఆ బెల్టుమీద పడి విరిగిపోతే- మళ్ళీ అయ్యకి ఇక్కడే పనొస్తుందని దేవుణ్ణి బతిమాలుకునేది. మెరుపుల వెలుగులో ఆ కన్వేయర్ బెల్టు తళుక్కున కనిపిస్తే గుండె ఝల్లుమనేది.

855

రోజూ ఖాకీబట్టలు వేసుకొన్న వాళ్ళు వెళ్తూండే వాళ్ళు. నలుగురు. దార్లో నీలి గుడిసె దగ్గిరకొచ్చినప్పుడు,

"ఏయ్ గుంటా, కసింత నీళ్ళిస్తావేటి?" అని దాహం తీర్చుకొనే వాళ్ళు. వాళ్ళు మొదట్లో ఉత్సాహంగా పలకరించే వాళ్ళు గానీ రాను రానూ నీరసంగా అన్పించేరు. ఒకోసారి నీలే ఆటయింకి లోటాతో నీళ్లు పట్టుకొని వుండేది. అయితే చప్పుడూ ధూళీ ఎప్పుడూ ఉండేదే.

ఆవేళ మధ్యాన్నం మూడు దాటింది.
ఎండ ఇంకా తగ్గనేలేదు.

'మిషనెట్లా ఉంటదో' అంటే 'సూపిస్తా' నన్నడు కర్రి అప్పారావు. పైకి చూస్తే కళ్ళల్లో దుమ్ము పడుతోంది. స్తంబాల వారన నడుచుకుంటూ వెళ్తోంది.

కొంచెం దూరంలో ఉందనగా,
చప్పుడు ఆగిపోయింది.
పైన రాళ్ళు ఎక్కడివక్కడే వున్నాయి.
ఇంతకాలంలో ఆగటం ఇదే మొదలు.
"మిషను సూపించటానికాపేసారేటో –" అనుకొని పరిగెత్తింది.

వాళ్ళు నలుగురూ ఖాకీబట్టలు వాళ్ల గుడ్డల్తో ముఖాలు తుడుచుకుంటూ ఆ గది లోంచి బయటకు వస్తున్నారు.

"ఏటయింది?" ఆత్రంగా అడిగింది.

"నీకేం తెలుస్తుందిలే, యీళ్ళిచ్చే సొమ్ములకు ఈ బెల్టు ఆపరేషన్ కిట్టదు. స్ట్రయికు" అన్నాడు కర్రి అప్పారావు.

"అంటే ఏటి?"

"అంటే– పైన వెళ్తోంది కదా, అది అలానే బూంపట్టు పట్టిన సిసింద్రీలా ఉంటుంది–"

"మరయితే ఇప్పుడాళ్ళు ఏటి సేస్తారు?" అంది నీలి షెడ్డు పక్కనున్న ఆఫీసు గదివైపు వేలు చూపిస్తూ.

---

వచ్చే సంచికలో....

భూమయ్య కిష్టాగౌడ్ సంస్మరణ సంఘం, ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుచేసిన భూమయ్య కిష్టాగౌడ్ సంస్మరణ ఉపన్యాసాల్లో మొదటిది, సుప్రసిద్ధ పత్రికా రచయిత సుమంతో బెనర్జీ ప్రసంగవ్యాసం 'మరణశిక్ష, న్యాయ, రాజకీయ, మానవతా విలువలు' ప్రచురించబడుతుంది.

856